

దూసుకెళ్తున్న ఆర్టీసీ కార్గో

ఆర్టీసీ కార్గో పార్సిల్ సర్వీసు సేవలు ఇప్పుడు డోర్ డెలివరీ రూపంలో వినియోగదారుల ఆదరణ పొందుతున్నాయి. 8లో



వెలమలకు పెద్దపీట

రాష్ట్రంలో వెలమలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి అన్నిరంగాల్లో పెద్దపీట వేశారని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. 8లో



దొమ్మేటి సేవలు ఎనలేనివి

శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి సేవలు ఎనలేనివని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. 8లో

న్యూస్‌రీల్

పాలకొల్లు చేరిన శ్రీవారి రథయాత్ర



ఉత్సవమూర్తుల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పాలకొల్లు అర్బన్ : తిరుమల,తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తుల విగ్రహాలతో కూడిన ప్రత్యేక రథయాత్ర ఆదివారం పాలకొల్లు చేరుకుంది. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవమూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ జోగి వెంకటేశ్వరరావు, ట్రస్టీలు, అర్చకస్వామి చైతన్య, ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు తదితరుల రథయాత్రకు స్వాగతం పలికారు. కోలాట భజనలు, శ్రీనివాసుని సహస్ర నామాలు, గోవిందనామాలతో భక్తులు పూజలు చేశారు.

రాట్నాలమ్మా.. నమోనమః



పెదవేగి: రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయాన్ని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు సందర్శించారు. ఆలయంలో మొక్కులు తీర్చు కుని ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయానికి పూజా టికెట్లపై రూ.36,335, విరాళాల రూపంలో రూ.12,745, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.28,800, ఫొటోల అమ్మకంపై రూ.3,670 మొత్తంగా రూ.81,550 ఆదాయం లభించినట్టు ఈఓ ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేశామని ఆయన చెప్పారు.

నేడు ఎంపీ మిథున్‌రెడ్డి రాక

పాలకొల్లు అర్బన్ : లోక్‌సభ ఎంపీ, వైఎస్సార్‌సీపీ ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సోమవారం పాలకొల్లు వస్తున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సమావేశమవుతారని, పాలకొల్లు నియోజకవర్గంలో ఈనెల 8న నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర ఏర్పాట్లపై సమీక్షిస్తారని పేర్కొన్నారు.

రైతులను ఆదుకుంటాం



వరి పొలాలను పరిశీలిస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు

చింతలపూడి: చింతలపూడి మండలంలో వర్షాభావ పరిస్థితులతో ఎండిపోయిన వరి పొలాలకు సంబంధించి రైతులను ఆదుకుంటామని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని పాత చింతలపూడి, సమ్మెటవారిగూడెం, మల్లాయగూడెం, ఏసీ అగ్రహారం, పోతునూరు గ్రామాల్లో పర్యటించి వరి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 15 వేల ఎకరాల్లో వరి సాగు ప్రారంభిస్తే వర్షాభావం వల్ల సుమారు 2,500 ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయారన్నారు. అధికారులు సేకరించిన వివరాలను ఇప్పటికే ప్రకృతి విపత్తుల విభాగానికి నివేదించారని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి పంట వివరాలు సీఎం జగన్ ఈ–క్రాప్ నమోదు చేయించారని, ఏ దశలోనూ రైతులు నష్టపోకూడదని పలు కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. రైతులకు స్థానికంగా సేవలందించేలా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటుచేశారని చెప్పారు. సచివాలయంలో వ్యవసాయ అధికారిని కలిసి రైతులు వివరాలు అందించాలని, ఈ–క్రాప్ చేయించుకున్న రైతులకు నష్టపోయిన పంటకు బీమా పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రైతుల సమస్యలను వ్యవసాయశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లానని, కేంద్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. మెట్ట ప్రాంతంలో చెరువులు, ప్రాజెక్టులు, కాలువలు 30 ఏళ్లుగా నిర్లక్ష్యానికి, ఆక్రమణలకు గురయ్యాయన్నారు. సోమవారం జిల్లాలోని ఇరిగేషన్ , రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశామని ఎంపీ శ్రీధర్‌బాబు చెప్పారు.

సంతోషాలు శోబిల్లు

స్వగృహమస్తు

- జిల్లాలో 25,783 ఇళ్ల నిర్మాణాలు పూర్తి
- లబ్ధిదారులకు రూ.538.40 కోట్ల అందజేత
- బిల్లులు పెండింగ్ లేకపోవడంపై హర్షం
- వివిధ దశల్లో వేలాది గృహ నిర్మాణాలు



దువ్వలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్లు



పాలకొల్లు మండలం గవరపేటలో సొంత స్థలంలో ప్రభుత్వ సాయంతో నిర్మించుకున్న ఇల్లు

భీమవరం(ప్రకాశం చౌక్): పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి పట్టాలు అందించి గృహ నిర్మాణాలకు ప్రోత్సహిస్తున్నారు. నిర్మాణం చేపట్టిన ప్రతి ఇంటికీ త్వరితగతిన బిల్లులు చెల్లిస్తూ వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా గృహనిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ఇంటి పట్టాతో పాటు నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేస్తోంది. ఈ మొత్తంలోనే నిర్మాణ సామగ్రి కూడా అందిస్తోంది. లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ తీసుకున్న తర్వాత మిగిలిన సొమ్ము బిల్లుల రూపంలో వారి ఖాతాలో జమచేస్తోంది. బిల్లులు సకాలంలో లబ్ధిదారులకు అందడంతో అంతటా హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం ప్రారంభించిన వెంటనే మెటీరియల్ సరఫరా చేయడంతో పాటు సకాలంలో నగదు అందించడంతో వేగంగా నిర్మాణాలు జరుపుకుంటున్నామని లబ్ధిదారులు అంటున్నారు.

రూ.538.40 కోట్ల ఖర్చు

జిల్లాలో 630 జగనన్న లేఅవుట్లు ఉన్నాయి. అలాగే సొంతంగా స్థలాలు ఉన్న వారు గృహ నిర్మాణం చేపట్టినా ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. జిల్లాలో మొత్తంగా 72,059 ఇళ్లు మంజూరు చేయగా ఇప్పటివరకు 25,783 నిర్మాణాలు పూర్తికాగా.. సుమారు 24 వేలకు పైగా గృహప్రవేశాలు జరిగాయి. జిల్లాలో పేదలకు ఇళ్ల కోసం ప్రభుత్వం 1531.308 ఎకరాలను సేకరించింది. వీటికి సంబంధించి ప్రభుత్వం రూ.538.40 కోట్లను ఖర్చు చేసింది.

జిల్లాలో గృహ నిర్మాణాలు

మండలాలు	20
మంజూరైన ఇళ్లు	70,938
లేఅవుట్లు	630
సేకరించిన భూమి	1531.308 ఎకరాలు
పూర్తయిన గృహాలు	25,783

నిర్మాణ సామగ్రి ఇలా..

లబ్ధిదారులకు ప్రభుత్వం 100 బస్తాల సిమెంట్, 450 కిలోల ఐరన్, 20 టన్నుల ఇసుక, ఇంటికి సరిపడా ఎలక్ట్రికల్ సామగ్రి అందిస్తోంది. ఈ మెటీరియల్‌కు అయిన మొత్తాన్ని మినహాయించి మిగిలి సొమ్మును లబ్ధిదారుల ఖాతాలకు జమచేస్తోంది.

సకాలంలో అందడంతో..



ప్రభుత్వం నాకు ఇల్లు మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు బిల్లు సకాలంలో అందించడంతో వేగంగా నిర్మాణం పూర్తిచేసుకున్నాను. సొంత స్థలం ఉన్నా ఇంటిని నిర్మించుకునే ఆర్థిక పరిస్థితి లేకపోగా ప్రభుత్వ సాయంతో నా కల నెరవేరింది.

– ఎం.ధనలక్ష్మి, గవరపేట, పాలకొల్లు మండలం

వేగంగా పూర్తయ్యేలా..



ప్రతి లబ్ధిదారుడి ఖాతాలో సకాలంలో ఇంటి నిర్మాణానికి సంబంధించి బిల్లు జమచేస్తున్నాం. అలాగే లబ్ధిదారులు కోరుకున్న మెటీరియల్ కూడా సరఫరా చేస్తున్నాం. కలెక్టర్ ఆదేశాలు సూచనలతో జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చర్యలు తీసుకున్నాం. ఇప్పటివరకు రూ.538.4 కోట్లు ఖర్చు చేశాం.

– డాక్టర్ ఆర్‌సీ ఆనంద్‌కుమార్, హౌసింగ్ పీడీ

మండలాల వారీగా పూర్తయిన ఇళ్లు.. బిల్లుల చెల్లింపు

మండలం	మంజూరైన ఇళ్లు	పూర్తయిన ఇళ్లు	బిల్లుల చెల్లింపు (రూ.కోట్లలో)
ఆచంట	2,508	1,228	22.7
పెనుగొండ	3,528	1,266	24.1
పెనుమంట్ర	3,350	1,365	27.4
పోడూరు	2,832	1,296	26.1
భీమవరం	1,691	912	16.7
భీమవరం అర్బన్	3,266	306	16.9
వీరవాసరం	1,548	765	14.2
మొగల్తూరు	2,202	1,339	24.5
నరసాపురం అర్బన్	4,841	448	13.6
నరసాపురం	2,984	966	19.0
పాలకొల్లు	1,298	884	16.4
పాలకొల్లు అర్బన్	2,503	231	7.8
యలమంచిలి	2,914	1,377	25.6
పెంటపాడు	2,283	1,292	25.4
తాడేపల్లిగూడెం	3,062	1,926	35.5
తాడేపల్లిగూడెం అర్బన్	3,547	1,181	33.4
అత్తిలి	2,478	924	16.7
ఇరగవరం	2,563	1,261	22.7
తణుకు	4,175	1,301	26.5
తణుకు అర్బన్	6,118	769	24.0
ఆకివీడు అర్బన్	1,342	229	9.2
ఆకివీడు	2,278	603	15.1
కాళ్ల	1,040	772	13.7
పాలకోడేరు	2,080	885	18.5
ఉండి	2,889	1,268	25.2
గణపవరం	1,663	919	17.2

విలువలు లేని పార్టీలకు తిరస్కరణ ఖాయం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



పెంటపాడు: అధికార దాహం కోసం కలిసిన విలువలు లేని పార్టీల మేనిఫెస్టోను ప్రజలు తిరస్కరించడం ఖాయమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం రాత్రి ప్రత్తిపాడులో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైతిక విలువలు లేని తెలుగుదేశం, జనసేన పార్టీలు ప్రజల బాగోగులు, ఆరోగ్యం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వీరిద్దరూ కలిసి ఉమ్మడి మేనిఫెస్టోలను సిద్ధం చేసినా ప్రజలు విశ్వసించరన్నారు. 2014లో పవన్ కల్యాణ్ మద్దతుతోనే చంద్రబాబు విజయం సాధించారని చెప్పుకొచ్చినా.. తర్వాత జనసేన వల్ల తాము గెలవడం ఏంటని టీడీపీ నాయకులు నానామాటలు అన్న సంగతిని పవన్ మర్చిపోయాడా అని ప్రశ్నించారు. ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని ఉమ్మడి మేనిఫెస్టో పెడుతున్నారని ధ్వజమెత్తారు. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును దోషిగా నిర్ధారిస్తే పవన్‌కల్యాణ్ మాత్రం జైలుకు వెళ్లి చంద్రబాబు కాళ్లు పట్టుకోవడాన్ని చూసి కాపులంతా సిగ్గుపడ్డారన్నారు. అటువంటి పవన్‌కల్యాణ్‌ను నమ్మి ప్రజలు ఎలా ఓటేస్తారని ప్రశ్నించారు. గత టీడీపీ పాలనలో అధినేతను అడ్డుపెట్టుకుని నాయకులు విచ్చలవిడి దోపిడీలు చేశారని విమర్శించారు. నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో ప్రజాసంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారని, సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల ద్వారా పాలనను ప్రజలకు చేరువ చేశారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయాన్ని పండుగ చేశారని, ప్రజలంతా సంతోషంగా ఉన్నారని మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం



పారిశుద్ధ్య కార్మికులకు కిట్లు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భీమవరం పశ్చిమగోదావరి జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు హైజిన్ కిట్ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలు విస్తృతం చేస్తున్నామని, ఆదివారం 375 హైజిన్ కిట్లను పారిశుద్ధ్య కార్మికులకు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు అందించామన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు మిల్లెట్లతో అల్పాహారం అందిస్తున్నామన్నారు. అలాగే ఇటీవల తణుకులో యానాది కుటుంబాలకు దుస్తులు, వంట సామగ్రి అందించారన్నారు. జిల్లా యంత్రాంగం తరపున యానాది కుటుంబాలకు ఆధార్ కార్డులు అందించి, వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా, వారికి సొంతిళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్యక్రమాల్లో ఉత్తమ సేవలు అందించినందుకు జాతీయ స్థాయిలో అవార్డు పొందిన బొత్స మోషే, మరో ఏడుగురికి కలెక్టర్ మెమెంటోలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఆర్డీఓ కె.శ్రీనివాసులు రాజు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, తహసీల్దార్ వై.రవికుమార్, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షుడు ఎంఎస్‌వీ శివరామభద్రిరాజు, సీనియర్ కో–ఆర్డినేటరు ఎస్.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలల్లో నైతిక విలువలు పెంపొందించాలి



విద్యార్థులకు చిత్రలేఖనం చార్టులు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: బాలల్లో సృజనాత్మకతతో పాటు నైతిక విలువలు పెంపొందిస్తూ అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. భీమవరంలో ఆదివారం బాలోత్సవ వేడుకల సందర్భంగా స్థానిక చింతలపాటి బాపిరాజు హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన అడవి బాపిరాజు స్మారక చిత్రలేఖన పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. నిత్య అభ్యసనంతోనే చిత్రలేఖనంలో ప్రగతి కనిపిస్తుందన్నారు. పోటీతత్వంతోనే విజయాలు చేరువవుతాయనే విషయాన్ని విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వివరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందని, కేవలం విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని అన్నారు. విద్యాభివృద్ధికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలకు ప్రభుత్వ గుర్తింపు ఉంటుందన్నారు. అడవి బాపిరాజు స్మారక చిత్రలేఖన పోటీలను మూడు విభాగాల్లో నిర్వహించి విజేతలకు బహుమతులు ఇవ్వడం అభినందనీయమన్నారు. ముందుగా బాపిరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు చార్టులను కలెక్టర్ ప్రశాంతి అందజేశారు. ఆర్డీఓ కె.శ్రీనివాసులురాజు, తహసీల్దార్ వై.రవికుమార్, హెచ్‌ఎంలు సీహెచ్ నిర్మలాకుమారి, బి.శ్రీనివాసరావు, కాళ్లకూరి పద్మావతి, కొత్తపల్లి శివరామరాజు, చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకట్రాజు పాల్గొన్నారు.

తత్ప్రణమామి సదాశివ లింగం



ఆకివీడులో మట్టి శివలింగాలను తయారు చేస్తున్న మహిళలు

హరహర మహాదేవ శంభో శంకరా అంటూ భక్తులు శివలింగాలను తయారు చేస్తున్నారు. కాశీలో మహాశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు సహస్ర కోటి శంకర సేవలో భాగంగా ఆకివీడు ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో భక్తులు మట్టి శివలింగాలను తయారుచేస్తున్నారు. సుమారు 15 లక్షల శివలింగాల తయారీకి సంబంధించి మట్టిని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాలకు తరలించారు. దీనిలో భాగంగా ఆకివీడులో 7 వేల శివలింగాల తయారీకి మట్టి వచ్చింది. జిల్లావ్యాప్తంగా తయారు చేసిన శివలింగాలను ఈనెల 16న జంగారెడ్డిగూడెం తరలిస్తారు. అక్కడి నుంచి వీటన్నింటినీ ఈనెల 26న కాశీ క్షేత్రానికి పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు.

– ఆకివీడు



గ్రామాల్లో అభివృద్ధి పనులకు పెద్దపీట

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



పాలూరులో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: గ్రామాల్లో శాశ్వతమైన అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ కోట్లాది రూపాయాలు వెచ్చిస్తోందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం అత్తిలి మండలం పాలూరు గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.24 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లకు భవనాలను నిర్మించి ప్రజలు, రైతులకు సత్వర సేవలందిస్తున్న ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు అవసరమైన అన్ని సేవలు లభిస్తున్నాయన్నారు. ముందుగా మంత్రి కారుమూరి ఉమారామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ అడ్డాల జానకి, సర్పంచ్ దయామణి, ఉపసర్పంచ్ రాపేటి సింహాచలం, వైస్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, ఏఓ టీకే రాజేష్ ఉన్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితాకు చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించడానికి బీఎల్‌ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఆదివారం పురపాలక సంఘం పరిధిలో చింతలపాటి బాపిరాజు ఉన్నత పాఠశాల, రూరల్ గ్రామం గొల్లవానితిప్ప, కాళ్ల మండలం పెదమిరం తదితర గ్రామాల్లో స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా జరుగుతున్న స్పెషల్ క్యాంపెయిన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటర్ల జాబితాలను పరిశీలించి బీఎల్‌ఓలను వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ సమయంలో ఓటర్ల జాబితాలకు పూర్తి బాధ్యత బీఎల్‌ఓలు వహించాలన్నారు. జాబితాలో అక్కడా ఫొటోలు లేకుండా ఉన్న ఓటర్లను గమనించి ఫొటోలను తప్పకుండా అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఫారం 6 , ఫారం 8 లు ఎన్నెన్ని వచ్చాయి ఎలా పరిష్కరించారని ప్రశ్నించారు. 100 ఏళ్లు దాటినా వారు ఎంత మంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. డెత్ ఓటర్లు డూప్లికేషన్లు లేకుండా చూడాలని, స్పెషల్ క్యాంపెయిన్ తర్వాత ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలను మరోమారు పరిశీలించాలని ఆదేశించారు. అర్హులైన వారందరిని ఓటర్లుగా చేర్పించాలన్నారు. భీమవరం నియోజకవర్గ ఈఆర్వో, ఆర్డీఓ కె.శ్రీనివాసులురాజు, తహసీల్దార్ వై.రవికుమార్ తదితరులు ఆమె వెంట ఉన్నారు.

పంట నమోదు పూర్తి

- ఆర్బీకేల్లో అర్హుల జాబితాలు
- జిల్లాలో 2.11 లక్షల ఎకరాల్లో సార్వా వరి సాగు



పాలకొల్లు మండలం ఆగర్తిపాలెంలో ఈకేవైసీ నమోదు చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: జిల్లాలో సార్వా పంటకు సంబంధించి పంట నమోదు ప్రక్రియ పూర్తయ్యింది. రైతు వేసిన పంట వివరాలను, ఆ రైతు ఫొటోతో సహా గ్రామ వ్యవసాయాధికారులు ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. దీని ద్వారా రైతులకు పంట నష్ట పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీలు, ప్రభుత్వ రాయితీలు, రైతు భరోసా సాయం వంటి ప్రయోజనాలు పొందే వీలుంటుంది. అలాగే పండించిన ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వం సేకరించేందుకు అవకాశం ఉంటుంది. జిల్లాలోని 20 మండలాల్లో 2,11,186.83 ఎకరాల్లో 1,16,037 మంది రైతులు ఈకైవైసీ (పంట నమోదు) పూర్తి చేసుకున్నారు. ఇరగవరం మండలంలో అత్యధికంగా 13,269.16 ఎకరాల్లో 7,472 మంది రైతులు, అత్యల్పంగా మొగల్తూరు మండలంలో 818.69 ఎకరాల్లో 643 మంది రైతులు పంట వివరాలు నమోదు చేసుకున్నారు. రైతుల వారీగా, వారు సాగు చేస్తున్న భూమి, సర్వే నంబర్‌తో సహా జాబితాలను రైతు భరోసా కేంద్రాల్లో అధికారులు సిద్ధం చేశారు.

రాయితీలు పొందొచ్చు



ఈకేవైసీ పూర్తయిన రైతులకు మాత్రమే పంట విక్రయించుకునే సౌలభ్యం ఉంటుంది. అలాగే పథకాలు, రాయితీల వర్తింపు ఉంటుంది. పాలకొల్లు సబ్ డివిజన్ పరిధిలో 18,270 మంది రైతులకు సంబంధించి 33,339.43 ఎకరాలకు పంట నమోదు పూర్తి చేశాం. జాబితాలను ఆర్‌బీకేలో అందుబాటులో ఉంచాం.

– అడ్డాల పార్వతి, ఏడీఏ, పాలకొల్లు

సార్వా వరి పంట నమోదు

మండలం	విస్తీర్ణం ఎకరాలు	రైతుల సంఖ్య
పాలకొల్లు	9,181.14	5,546
నరసాపురం	6,058.03	3,538
పోడూరు	12,994.97	6,819
యలమంచిలి	4,887.96	3,423
వీరవాసరం	11,887.24	6,695
అత్తిలి	13,784.28	9,613
ఆకివీడు	3,816.15	1,878
ఆచంట	10,213.32	5,905
ఇరగవరం	13,269.16	7,472
ఉండి	10,791.46	4,550
కాళ్ల	3,878.35	1,855
గణపవరం	11,694.61	6,617
తణుకు	11,257.79	6,990
తాడేపల్లిగూడెం	24,714.68	12,190
పాలకోడేరు	11,097.64	5,092
పెనుగొండ	11,660.41	5,791
పెనుమంట్ర	12,125.61	6,757
పెంటపాడు	21,070.46	12,312
భీమవరం	5,984.63	2,351
మొగల్తూరు	818.69	643
మొత్తం	2,11,186.831,16, 037	

క్లుప్తంగా

పిచ్చికుక్క దాడిలో ఏడుగురికి గాయాలు

కుకునూరు: పిచ్చికుక్క దాడి ఘటనలో ఒకే రోజు ఏడుగురు చిన్నారులు గాయపడ్డారు. కుక్కునూరు మండల కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. ఆదివారం మండల కేంద్రంలోని 10 సంవత్సరాల లోపు పిల్లలను కరిచి గాయపరిచింది. పిచ్చికుక్క దాడిలో ప్రశాంతి, గంగ, రెహమాన్, నాగు, భరత్, సాంబ, లోక్షిత విజయ్ మహేష్ అనే చిన్నారులు గాయపడ్డారు. శనివారం ఇదే కుక్క కేజీబీవీ పాఠశాల పీఈటీ భానుమతి, గోగుల హరిని కూడా గాయపరిచింది. మండల కేంద్రంలో కుక్కలు గుంపులుగా తిరుగుతూ దాడి చేస్తున్నాయని వీటిని నియంత్రించాలని కోరుతున్నారు. కుక్కునూరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శ్రీనివాసు మాట్లాడుతూ ఏడుగురు చిన్నారులు కుక్క కాటుతో ఆసుపత్రికి వచ్చారన్నారు. గాయాలు లోతుగా ఉండడంతో జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలని సూచించామన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పాఠశాలలో విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఒక ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి పీ శ్యామ్ సుందర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు జిల్లా పెదపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (పీఈ)గా పని చేస్తున్న పీ లక్ష్మన్నాయుడు అదే పాఠశాలలో చదువుతున్న ఒక విద్యార్థిని పట్ల ఇటీవల అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై విద్యార్థిని ఫిర్యాదు చేయగా సంబంధిత అధికారులు విచారించి నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి పంపారు. ఆ నివేదిక ప్రకారం ఉపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలు వాస్తవమేనని తేలడంతో అతనిని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని డీఈఓ తెలిపారు.

దూసుకెళ్తున్న ఆర్టీసీ కార్గో

- ఉత్సాహంగా డోర్ డెలివరీ మాసోత్సవాలు
- రాష్ట్రంలోనే మొదటి స్థానంలో తణుకు డిపో

తణుకు అర్బన్: ఆర్టీసీ సంస్థ ఆదాయాన్వేషణలో భాగంగా ప్రవేశపెట్టిన కార్గో పార్సిల్ సర్వీసు సేవలు ఇప్పుడు డోర్ డెలివరీ రూపంలో వినియోగదారుల ఆదరణ పొందుతున్నాయి. వ్యాపార, వాణిజ్య, రైతుల పార్సిళ్లు ఆర్టీసీ కార్గో ద్వారా సురక్షితంగా ఇంటి గుమ్మంలోకే చేరడంతో వినియోగదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సులే మార్గమనే నినాదం తాజాగా కార్గో పార్సిల్ డోర్ డెలివరీలో కూడా నిరూపితమైంది. రాష్ట్ర వ్యాప్తంగా నిర్దేశించిన 87 ప్రాంతాల్లో కార్గో సెంటర్‌కు 10 కిలోమీటర్ల దూరంలోని ఇంటి గుమ్మంలోకే కార్గో డోర్ డెలివరీ సేవలు అందుతుండడంతో వినియోగదారులు అధిక శాతం కార్గో కేంద్రానికే తమ పార్సిళ్లు అందజేస్తున్నారు.

కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల సందడి

గత నెల 26 నుంచి ఈ నెల 25 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు తణుకు డిపోలో విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వినియోగదారులను ఆకర్షించే రీతిలో ప్రతి సోమవారం డోర్ డెలివరీలకు సంబంధించి ఒక లక్కీ డీప్ ద్వారా ముగ్గురు విజేతలకు చీరలు అందిస్తుండడంతోపాటు ఈ నెల 27న బంపర్ డ్రా ద్వారా ముగ్గురు విజేతలకు పట్టుచీరలు స్థానిక నరేష్ క్లాత్ షోరూమ్ సౌజన్యంతో అందజేస్తామని ప్రకటించారు. ఈ నెల 2న తణుకులో మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు.

రాష్ట్రంలోనే తణుకు మొదటిస్థానం

రాష్ట్ర వ్యాప్తంగా కార్గో డోర్ డెలివరీల్లో పశ్చిమగోదావరి జిల్లా ప్రథమస్థానం కాగా, తణుకు డిపో ప్రథమ స్థానంలో ఉంది. తణుకు డిపోకు సంబంధించిన కార్గో సిబ్బందిపై ఉన్నతాధికారులు ప్రశంసలు కురిపిస్తున్నారు. రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సైతం మాసోత్సవాల్లో భాగస్వామి అయి కార్గో సెంటర్‌కు వచ్చి కరపత్రాలను ఆవిష్కరించారు.



తణుకు ఆర్టీసీ డిపోలో కార్గో కేంద్రం

డోర్ డెలివరీల ధరల పట్టిక ఇలా..	
1 కేజీ వరకు	రూ. 18
1 నుంచి 6 కేజీల వరకు	రూ. 30
6 నుంచి 10 కేజీల వరకు	రూ.36
10 నుంచి 25 కేజీల వరకు	రూ.48
25 నుంచి 50 కేజీల వరకు	రూ.59

మాసోత్సవాల నాటి నుంచి పార్శిళ్ల బుకింగ్ ఇలా	
తణుకు	1,325
భీమవరం	1,317
నరసాపురం	720
తాడేపల్లిగూడెం	595

డోర్ డెలివరీ సేవల్ని ఆదరిస్తున్నారు



ఆర్టీసీ బస్సు ప్రయాణం ఎంత సురక్షితమో కార్గో ద్వారా పార్సిళ్లు కూడా అంతే సురక్షితంగా ఇంటి గుమ్మంలోకి చేరుతున్నాయి. రాష్ట్రంలో ఎక్కడికైనా 24 గంటల్లో పార్సిల్ అందజేస్తున్నాం. నిర్దేశించిన 87 ప్రాంతాల్లో డిపో నుంచి 10 కిలోమీటర్ల పరిధిలో ఇంటి గుమ్మంలోకే పార్సిల్‌ను చేరుస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 2022–23 సంవత్సరానికి కార్గో ద్వారా ఆర్టీసీకి రూ. 170 కోట్ల ఆదాయం సమకూరింది.

– జి.వెంకట సుబ్బారావు, ఉమ్మడి జిల్లా కమర్షియల్ మేనేజరు

అత్యుత్తమ సేవలందిస్తున్నాం



కార్గో డోర్ డెలివరీ సేవలు సద్వినియోగం చేసుకోవాలనే ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లగలిగాం. గతనెల 26 నుంచి ప్రారంభమైన వారోత్సవాల్లో వినియోగదారులను ఆకర్షించేలా లక్కీ డ్రాలు నిర్వహిస్తూ విజేతలకు బహుమతులు అందిస్తున్నాం. డిపో మేనేజరుతోపాటు కార్గో ఉన్నతాధికారుల సహాయ సహకారాలు తీసుకుంటూ సమష్టి కృషితో పనిచేస్తున్నాం. ఇంతవరకు తణుకు డిపో డోర్ డెలివరీల్లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉన్నందుకు చాలా సంతోషంగా ఉంది.

– షేక్ లాల్, తణుకు ఆర్టీసీ డిపో కార్గో ఇన్‌చార్జ్

● గడపగడపకు సంక్షేమం



పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

వెలమలకు పెద్దపీట

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆత్మీయ సమావేశంలో వక్తలు



వెలమ సంఘీయుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు(టూటౌన్): రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వెలమలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్ని రంగాల్లోనూ పెద్దపీట వేశారని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. ఏలూరు మినీ బైపాస్ రోడ్డులోని చలసాని గార్డెన్స్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వెలమ సంఘీయుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పద్మశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా తనను జెడ్పీ చైర్‌పర్సన్‌ను చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు ఆజన్మాంతం రుణపడి ఉంటామన్నారు. వెలమలకు రాజకీయంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, మున్సిపల్ చైర్మన్‌లు, జిల్లా పరిషత్ చైర్మన్‌లు ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. పార్టీలకు అతీతంగా ఎవరికి ఏ పని ఉన్న తనను సంప్రదించాలని చెప్పారు. జిల్లాలో 2.50 లక్షల మందికి పైగా వెలమలు ఉన్నా తమ ఉనికిని చాటడంలో వెనుకబడి ఉన్నారన్నారు. జిల్లాలోని వెలమలు ఐక్యంగా ఉండాలని, ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. నవరత్నాలు చైర్మన్ అంకం రెడ్డి నారాయణ మూర్తి మాట్లాడుతూ వెలమలు ఉనికిని చాటుకోవడానికి విద్య, వైద్య రంగాల్లో ముందుకు వెళ్లాలని తెలిపారు. రాజకీయ రంగంలో మరింత మందికి అవకాశం అందించేందుకు నాయకులు కృషి చేయాలన్నారు. ఏ అవసరం ఉన్నా తన వద్దకు రావాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, మాజీ మంత్రి మరడాని రంగారావు మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కిలాడి జ్యోతి దుర్గారావు, కొరుపూరి సత్యవతి నాగేశ్వరరావు, భీమవరపు పాపారావు, పెదపాడు మండల వైస్ ప్రెసిడెంట్ రెడ్డి స్వర్ణ కుమారి, గుబుపూరు శ్రీను, నౌడు అప్పారావు, అర్నేపల్లి అప్పారావు, కర్రి హిమబిందు, రెడ్డి ధనుంజయ, బళ్ల శివ, బళ్ల త్రిమూర్తులు, సంబంగి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

నూజివీడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న అండర్–19 జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఏపీ జట్టు తరఫున పాల్గొనేందుకు నూజివీడుకు చెందిన క్రీడాకారుడు ఎండీ మస్తాన్ ఎంపికయ్యాడు. గత నెల 29 నుంచి 31 వరకు అన్నమయ్య జిల్లా మదనపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో మస్తాన్ ప్రతిభ కనబరిచి కృష్ణా జిల్లా జట్టు ద్వితీయస్థానంలో నిలవడంలో కీలకపాత్ర పోషించాడు. దీంతో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. పోటీలకు ఎంపికైనందుకు కళాశాల కరస్పాండెంట్ కుప్పాల శంకరరావు అభినందించడంతో పాటు నగదు బహుమతి అందజేశారు.

దొమ్మేటి సేవలు ఎనలేనివి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



అత్తిలిలో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

అత్తిలి: శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి సంఘాభివృద్ధికి ఎనలేని కృషిచేశారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అత్తిలి కెనాల్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆదివారం రాత్రి మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి కారుమూరి మాట్లాడుతూ శెట్టిబలిజ సంఘానికి గుర్తింపుతెచ్చి, వారి అభ్యున్నతికి వెంకటరెడ్డి ఎంతగానో పాటుపడ్డారని అన్నారు. వెనుకబడిన కులాల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో పాటుపడుతున్నారని చెప్పారు. భవిష్యత్ తరాల వారికి వెంకటరెడ్డి సేవలను తెలియజేయడం కోసమే వెంకటరెడ్డి విగ్రహాలను నెలకొల్పుతున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్ మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డిని సంఘీయులంతా ఆదర్శంగా తీసుకోవాలని, శెట్టిబలిజ సంఘాలన్నీ ఏకతాటిపైకి రావాలని అన్నారు. శెట్టిబలిజలకు రాజకీయ గుర్తింపుతెచ్చింది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య మాట్లాడుతూ సమాజంలో ఏ సంఘమైనా బలోపేతం కావాలంటే విద్య ఒక్కటే మార్గమని, అలాంటి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. శెట్టిబలిజ సంఘ యువనాయకుడు వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా బోడసుకుర్రులో జన్మించిన దొమ్మేటి వెంకటరెడ్డి 1920లో శెట్టిబలిజ సంఘాన్ని స్థాపించి, ఆనాడు 10 వేల మందితో సభను ఏర్పాటు చేసారన్నారు. దొమ్మేటి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకునేందుకు కొంతమంది కుయుక్తులు పన్నారని, వాటిని పట్టించుకోకుండా సభను విజయవంతం చేశారని అన్నారు. సంఘ సభ్యులంతా ఐకమత్యంగా ఉండి సంఘాలను మరింత బలోపేతం చేయడానికి పాటుపడాలని కోరారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, వాసంశెట్టి సుభాష్‌ను సంఘం తరపున సన్మానించారు. అత్తిలి శెట్టిబలిజ సంఘాన్ని ప్రకటించారు. సంఘ అధ్యక్షుడిగా కముజు శ్రీనివాస్‌తో పాటు కమిటీ పాలకవర్గ సభ్యుల జాబితాను విడుదల చేశారు. ముందుగా కె.స ముద్రపుగట్టు గ్రామం నుంచి భారీ ర్యాలీగా తరలి వచ్చారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘ నాయకులు చింతపల్లి గురుప్రసాద్, పంపన అంజిబాబు, కుడిపూడి చంద్రరావు, జక్కంశెట్టి రాజేంద్రప్రసాద్, కడలి రాంప్రసాద్, సర్పంచ్ గంటా విజేత, బండి వెంకటలక్ష్మి, కముజు శ్రీనివాస్, గుబ్బల ఆంజనేయులు, పెచ్చెట్టి రామకృష్ణ, దొంతు దానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ



కోట లక్ష్మణకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ కోరాడ విజయలక్ష్మి



విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అప్పారావుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ శ్రీనివాసరావు

భీమడోలు: పోలసానిపల్లికి చెందిన వలంటీర్లు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి పింఛన కానుక నగదు సొమ్మును అందించి తమ సేవా గుణం చాటుకున్నారు. గ్రామానికి చెందిన నాంచారమ్మ ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా స్పందించి ఆమె వద్దకు వలంటీర్ హిమబిందును పంపారు. అక్కడ పింఛన్ అందించారు. గ్రామంలోని కోట లక్ష్మణ ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ విజయలక్ష్మి ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందించారు.

విజయవాడ వెళ్లి.. పింఛన్ అందించి

ద్వారకాతిరుమల: విజయవాడ ఆస్పత్రిలో గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న ఒక వృద్ధుడి వద్దకు వెళ్లి మరీ పింఛన్‌ను అందించాడు వలంటీర్. మండలంలోని తిరుమలంపాలెంకు చెందిన వృద్ధుడు మాజేటి అప్పారావు విజయవాడలోని అను ఆస్పత్రిలో ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకున్నారు. దాంతో వలంటీర్ శ్రీనివాసరావు ఆదివారం విజయవాడ ఆస్పత్రికి వెళ్లి అప్పారావుకు పింఛన్‌ను అందించాడు. ఈ సందర్భంగా వలంటీర్‌ను పలువురు అభినందించారు.

చోరీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఓ ఇంటిలో జరిగిన చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని మైసన్నగూడెంకు చెందిన సయ్యద్ సుభాని బంధువులతో కలిసి ఈ నెల 3వ తేదీన గుబ్బల మంగమ్మ తల్లి గుడికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటిలోని వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. ఇంటి పై కప్పు కాలి ఉన్న ప్రాంతం నుంచి ఇంటిలోకి దిగినట్లుగా కాలి గుర్తులు ఉండటం, ఇంటిలో బీరువాలో ఉన్న రెండు జతల చెవి దుద్దులు కనిపించకపోవడంతో సుభాని చోరీ జరిగినట్లు గుర్తించి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన షేక్ మదీన షరీఫ్‌పై అనుమానం ఉన్నట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొనడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కోడిపందేలు ఆడుతున్న ముగ్గురి అరెస్టు

జంగారెడ్డిగూడెం రూరల్: చక్రదేవరపల్లి గ్రామంలో కోడిపందేల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. కోడిపందాలు ఆడుతున్నారనే సమాచారం అందుకున్న ఎస్సై దుర్గ మహేశ్వరరావు తన సిబ్బందితో దాడులు చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.1470, ఒక కోడి, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

క్లుప్తంగా

స్థలం కేటాయించాలని వినతి



మంత్రికి విన్నవిస్తున్న ముస్లింలు

తాడేపల్లిగూడెం (టీటీసీ): పెంటపాడులో డాక్టర్ అబ్దుల్ కలాం షాదీఖానాకు సమీపంలోని మార్కెట్ పక్కన 121 గజాల గ్రామ కంఠ భూమిని మసీదు కోసం, ఉర్దూ పాఠశాలకు స్థలాన్ని కేటాయించాలని పెంటపాడుకు చెందిన ముస్లింలు మంత్రి కొట్టు సత్యనారాయణను ఆదివారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి స్థలం విషయాన్ని పరిశీలించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ముస్లింలు పాల్గొన్నారు.

రజక ఆత్మగౌరవ మహాసభకు తరలిరావాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రజక సంఘ నాయకులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): రజక ఐక్యవేదిక అధ్యక్షులు అంజిబాబు ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన గుంటూరు జిల్లా మంగళగిరి నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా నిర్వహించే రజక ఆత్మగౌరవ మహాసభకు తరలిరావాలని రజక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలో ఆదివారం రజక కమ్యూనిటీ హాల్‌లో నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు అడ్డాల నరసింహారావు, నాయకులు మహేష్, తదితరులు రజక ఆత్మగౌరవ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రజక సంఘం నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రత్తిపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

పెంటపాడు: గత రెండు రోజుల నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్తిపాడులో నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగింపు సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు వీర్ల గోవింద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ మాజీ సర్పంచ్, పార్టీ సీనియర్ నాయకులు వీర్ల బ్రహ్మారావు విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం మంత్రి చేతుల మీదుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉండిలో 99.16 శాతం పింఛన్ల పంపిణీ

ఉండి: ప్రతి నెలా అందించాల్సిన పింఛన్ తగిన సమయానికి అందిస్తూ ఎందరో పింఛన్‌దారుల జీవితాల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెలుగులు నింపుతున్నారు. దీనిలో భాగంగా ఆదివారం మండలంలో ఆదివారం ఇంకా మిగిలిన లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేశారు. అన్ని రకాల లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేశారు. మండలంలో 8,969 పింఛన్లు నవంబర్ నెలలో విడుదల కాగా, వాటిలో 8,889 పింఛన్‌లకు గాను ఆదివారం నాటికి రూ.2,40,67,250 నగదును 99.16 శాతం మేరకు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

భీమవరం మండలంలో భారీ వర్షం

భీమవరం అర్బన్: బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో పలువురు వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామాలలో శివారు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ వర్షం వల్ల దుబ్బు దశలో వరి చేలకు ఎంతగానో మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు.

మందాలమ్మ ఆలయాభివృద్ధికి విరాళం

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మ ఆలయాభివృద్ధికి వడలికి చెందిన చప్పారామస్వామి కుమార్తె, విజయవాడలో ఉంటున్న వేముల పల్లి విజయలక్ష్మీ దంపతులు రూ.10,116 విరాళం అందించినట్లు ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం విరాళాన్ని ఆలయార్చకులు రమణకు అందించారని, వీటిని అన్నదాన భవనం, ఇతర అభివృద్ధి పనులకు వినియోగించనున్నట్లు తెలిపారు.

నేడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సబ్‌కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్ స్వీకరిస్తారు. డివిజన్‌స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని కోరారు.

పేదల పక్షపాతి వైఎస్ జగన్



ప్రత్తిపాడులో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతిగా అనేక పథకాలు ప్రవేశపెట్టి వారిని ఆర్థికంగా ఆదుకుంటున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ప్రత్తిపాడు గ్రామంలో ఆదివారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండోరోజు నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా పథకాలు సరిగా అందుతున్నాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబు దోపిడీకి పాల్పడితే నేడు జగనన్న కొన్ని లక్షల కోట్ల రూపాయలు ప్రజలందరికీ పథకాల పేరిట పంచుతున్నారన్నారు. ఈ తేడాను ప్రజలు గమనించాలన్నారు. కాగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రెండోరోజు ప్రత్తిపాడు విచ్చేసిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రికి గ్రామంలో భారీ స్వాగతం లభించింది. పలువురు నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శాలువాలతో సన్మానించారు. పూలదండలు, బొకేలు, మహిళలు హారతిపళ్లాలతో మంత్రికి భారీగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి హైమావతి, పార్టీ అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, వీర్ల గోవింద్, వీర్ల వెంకటేష్, వీర్ల రామచంద్రరావు, సత్యనారాయణ, కండెల్లి వెంకట్రావు, మల్లిపూడి రత్నాకర్, ముప్పిడి మోహనరావు, పెనుమాక శ్రీను, వేడంగి బుజ్జి, గెల్లా నవీన్, సొసైటీ అధ్యక్షులు గుండుమోగుల సాంబయ్య, దుర్గమ్మ అమ్మవారి ఆలయ చైర్మన్ సైపురెడ్డి రాంబాబు, తూము చిన్న, దాసరి ప్రవీణ, జవ్వాది శేషగిరి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపదరావు కృష్ణారావు, ఎంపీడీవో బాలాజీ, దేవ వెంకటరమణ, ములగాల బాబ్జి, మద్రే కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణకు 1675 దరఖాస్తులు

తాడేపల్లిగూడెం: ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, అభ్యంతరాలకు సంబంధించి శని, ఆదివారాలలో బూత్‌లవారీగా నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో వచ్చిన అభ్యంతరాల తదితరాల వివరాలను ఎన్నికల డీటీ ప్రకటించారు. పట్టణంలో ఫారం–6 కింద 18 నుంచి 19 సంవత్సరాల వయస్సున్న వారి నుంచి 48, ఫారం 06 కింద ఇతరుల నుంచి 60, ఫారం ఏడు కింద 27, ఫారం 08 కింద 122 దరఖాస్తులు నాలుగోతేదీన వచ్చాయి. ఐదో తేదీన ఫారం 06 కింద 18 నుంచి 19 సంవత్సరాల వయస్సున్న వారి నుంచి 86, ఫారం 06 కింద ఇతరుల నుంచి 139, ఫారం ఏడు కింద 59, ఫారం 08 కింద 195 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం కలిపి ఫారం 06 కింద 134, ఫారం 06 ఇతరులు 199, ఫారం 07 కింద 86, ఫారం 08 కింద 317 దరఖాస్తులు వచ్చాయి. గూడెం మండలంలో ఫారం 06 కింద 156, ఫారం 06 ఇతరుల నిమిత్తం 173, ఫారం 07 కింద 64, ఫారం 08 కింద 164 దరఖాస్తులు వచ్చాయి. పెంటపాడు మండలంలో రెండు రోజుల్లో ఫారం 06 కింద 18 –19 సంవత్సరాల వయస్సు వారి నుంచి 118, ఇతరుల నుంచి 78, ఫారం 07 కింద 67, ఫారం 08 కింద 119 దరఖాస్తులు వచ్చాయన్నారు. నియోజకవర్గంలో మొత్తం 1675 దరఖాస్తులు వచ్చాయి.

ప్రచార రక్షణ భేరి సభ జయప్రదం చేయాలి

తాడేపల్లిగూడెం (టీటీసీ): విజయవాడలో ఈ నెల 15వ తేదీన నిర్వహించే ప్రజా రక్షణ భేరీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు, నాయకులు కర్రి నాగేశ్వరరావు, సిరపరపు రంగారావు కోరారు. పట్టణంలో ఆదివారం జరిగిన తాలూకా రైల్వే గూడ్స్ షెడ్డు వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో నాయకులు మాట్లాడారు. కేంద్రం ఇచ్చిన అనేక హామీలు అమలు చేయడం లేదని, రాష్ట్రానికి ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. చిర్ల పుల్లారెడ్డి, కర్రి సాయిరెడ్డి, అడపా ఆంజనేయులు, కర్రి సుబ్బిరెడ్డి, ఆకుల నారాయణ, గాది వెంకట్రావు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందజేసిన తణుకు మైత్రి లయన్స్ క్లబ్ సభ్యులు

తణుకు టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నెలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి స్విమ్మింగ్ అండర్–14 పోటీలలో విజేతలై రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేసినట్లు తణుకు మైత్రి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు అక్కాల సుబ్బారావు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో తణుకు పట్టణానికి చెందిన బాలికల విభాగంలో బీ శ్రీనివేదిత ప్రథమ స్థానం, తేజస్వీని ద్వితీయ స్థానం, బాలుర విభాగంలో కడియాల అజయ్‌దేవ్ ప్రథమస్థానం సాధించి విజేతలుగా నిలిచారు. వీరు ఈనెల 8న తిరుపతిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా క్లబ్ తరఫున విద్యార్థులను, కోచ్ కే భార్గవ సాయిని అభినందించినట్లు తెలిపారు. క్లబ్ కార్యదర్శి అక్కాపంతుల బాలాజీ, ఎస్వీ సతీష్ బాబు, వై.శ్రీనివాస్, కె.రామమోహన్‌రావు, అల్లూరి కరుణాకర్ చౌదరి, కే రాజరాజేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో అన్నసమారాధన



అన్నసమారాధనలో వడ్డిస్తున్న వీర్ల గోవింద్

పెంటపాడు: ప్రత్తిపాడు వై.జంక్షన్‌లో వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చుట్టుపక్కల గ్రామలకు చెందిన సుమారు నాలుగు వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. పార్టీ పూర్వాధ్యక్షులు వీర్ల గోవింద్ ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఆలయ కమిటీ చైర్మన్ సైపురెడ్డి రాంబాబు, ఈవో బళ్ల నీలకంఠం, అర్చకులు సత్యనారాయణ, సిబ్బంది పార్థసారథి, తాడిపర్తి వీరాస్వామి, కమిటీ సభ్యులు రామచంద్రరావు, శేషగిరి, కాసాని శ్రీను, నూనె లక్ష్మి పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి ఆలయంలో భజన సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలతో భారీగా అలంకరించారు.

స్థల దాతల విగ్రహాల ఆవిష్కరణ



పాలూరు సొసైటీ వద్ద స్థల దాతల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి

అత్తిలి: పాలూరులో సహకార సంఘ భవనం స్థల దాతలు స్వర్గీయ అల్లూరి సత్యనారాయణరాజు, సీతమ్మ దంపతుల విగ్రహాలను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదివారం సంఘ భవనం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ సహకార సంఘం భవనం ఏర్పాటుకు దాతలు స్థలాన్ని ఇవ్వడంతో నేడు ఈ సహకార సంఘం ద్వారా వేలాది మంది రైతులకు మేలు జరిగిందన్నారు. ఈ సొసైటీ ద్వారా రైతులకు రుణాలతో పాటు వారికి అవసరమైన ఎరువులను విక్రయిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యులను మంత్రి కారుమూరి సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కునాథరాజు శ్రీహరిరాజు, సర్పంచ్ దయామణి, ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో చాంబర్ కృషి అభినందనీయం



వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గోపిను సత్కరిస్తున్న వర్తక ప్రముఖులు

పాలకొల్లు అర్బన్: చాంబర్ ఆఫ్ కామర్స్ వర్తకుల వ్యాపార దృక్పథంతో కాకుండా సామాజిక సేవా భావంతో పాలకొల్లు ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ప్రశంసించారు. ఆదివారం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ భవనంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి, టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు, దెందులూరు పార్టీ పరిశీలకులు యడ్ల తాతాజీలను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. గుడాల గోపి మాట్లాడుతూ తాను పాలకొల్లు ప్రజలకు సేవ చేయడానికి వచ్చానని, తన సేవలపై సంతృప్తి చెందితేనే తనకు ఓటు వేయాలని కోరారు. అలాగే పాలకొల్లు వర్తకులకు ఏ సమయంలో ఏ అవసరం ఉన్నా తక్షణం స్పందిస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆయన స్పందించి తక్షణం పబ్లిక్ ట్యాంకర్లను అక్కడ నుంచి తొలగించి ఆ ప్రాంతంలో ముగ్గు, బ్లీచింగ్ చల్లించాలని మునిసిపల్ కమిషనర్‌కు సూచించారు. చాంబర్ అధ్యక్షుడు కారుమూరి వెంకట నరసింహరావు, కార్యదర్శి దేవరపు లక్ష్మీనారాయణ, కోశాధికారి నెలకుర్తి వెంకట సత్యనారాయణ, గౌరవ సలహాదారులు వేగేశ్న రంగరాజు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో మెరుగైన జీవనం

- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- పాలూరులో గడపగడపకు మన ప్రభుత్వం



పాలూరులో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేస్తున్న మంత్రి కారుమూరి

అత్తిలి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి, ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం పాలూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై పూర్తి విశ్వాసంతో ఉన్నారని, తిరిగి రానున్న ఎన్నికలలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు చెందాల్సిన ప్రభుత్వ సొమ్మును గాదెకాడ పందికొక్కుల్లా దోచుకుతిన్నారని, దాని ఫలితంగా మాజీ సీఎం చంద్రబాబు ఊసలు లెక్కపెడుతున్నారని దుయ్యబట్టారు. గత పాలనలో పేదలకు ఒక్క సెంటు భూమికూడా ఇచ్చిన దాఖలాలు లేవని, సీఎం వైఎస్ జగన్ లక్షలాది మంది అక్కచెల్లెమ్మలకు ఇంటి స్థలాలు సమకూర్చి, ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు ఇటీవల జగనన్న ఆరోగ్య సురక్ష వంటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు జరిపి, మందులను అందజేశారన్నారు. గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పౌరసేవలు అందిస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజలు ఆశీస్సులు అందజేయాలని కోరారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలుచేయడంతో ఇతర పార్టీల వారు సైతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై కృతజ్ఞతాభావంతో ఉన్నారని చెప్పారు. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికీ వేల నుంచి లక్షలాది రూపాయాలు ఆర్థిక లబ్ధిచేకూరిందన్నారు. రానున్న రోజుల్లో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వ లబ్ధిపొందిన కుటుంబాలకు బ్రోచర్‌లను మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, సర్పంచ్ నాగమణి, ఉప సర్పంచ్ రాపేటి సింహాచలం, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, సొసైటీ అధ్యక్షుడు కునాథరాజు శ్రీహరిరాజు, వైస్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు శింగంశెట్టి శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, కంకటాల సతీష్, కోరుకొల్లు వెంకట్రావు, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఎంపీడీవో ఎండీ అమీలుజమా పాల్గొన్నారు.

సంచార వైద్యశాల ద్వారా 10 మందికి పరీక్షలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా ఆదివారం 10 మంది వృద్ధులకు ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకు పట్టణం, పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి పది మంది నడవలేని వృద్ధుల ఇళ్లకే వెళ్లి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. అసోసియేషన్ సభ్యుడు జీజీ మూర్తి ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాదికారి ఆర్జి భాస్కరరావు, గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పరిమెళ్ల జెడ్పీ హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పెంటపాడు: పరిమెళ్ల జెడ్పీ హైస్కూల్లో 1977–78 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 23 మంది విద్యార్థులు హైస్కూలులో కలుసుకుని సంతోషంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. అప్పటి గురువులను సన్మానించారు. స్కూలులో సైకిల్ షెడ్ నిర్మాణం కోసం ఐక్యంగా కృషి చేద్దామని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల రమాకుమారి, బోణం కృష్ణమూర్తి తదితరులు ఆధ్వర్యం వహించారు.

చిత్రలేఖన పోటీల్లో విజేతలు వీరే

సాక్షి, భీమవరం: పట్టణంలో బాలోత్సవం సందర్భంగా బాలోత్సం కమిటీ–ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో వసుధ ఫౌండేషన్, డ్రాయింగ్ టీచర్స్ అసోసియేషన్, ఉదయ్ ఆర్ట్ గ్యాలరీ, పాలకొల్లు మానవత సంస్థ సహకారంతో నిర్వహించిన అడవి బాపిరాజు స్మారక చిత్రలేఖన పోటీల్లో విజేతలను వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం వెల్లడించారు. సబ్ జూనియర్స్ విభాగంలో టి.జశ్వంత్‌సాయి, సి.రోహిత్, ఎం.లిఖిత్ వెంకట్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెల్చుకోగా, కె.నాగసాయి, ఎం.అషీర్‌వర్మ కన్సోలేషన్స్ బహుమతులు గెల్చుకున్నారు. జూనియర్స్ విభాగంలో ఎం.ప్రణతి, ఎం.యజ్ఞసూర్యపవన్‌కార్తికేయ, కొండవీటి కోటేశ్వర జోషిత్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, ఎం.యక్షిత, కె.జయనందన్ కన్సోలేషన్స్ బహుమతులు గెల్చుకున్నారు. సీనియర్స్ విభాగంలో ఎం.లోకేష్, ఎం.హాసిని, డి.లోహిత్‌శ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, మేకా నాగసాయిలక్ష్మీప్రసన్న, ఎండీ రోషిణి, వి.ప్రభాకర్, కె.నిఖిత, సీహెచ్ ప్రణవి సాయిదుర్గ, ఎల్.దుర్గాప్రసన్న, వై.సాయిలాస్య, ఎం.సంజయ్, కె.దినేష్‌శ్రీ సాయితేజ కన్సోలేషన్స్ బహుమతులు గెల్చుకున్నారు. ఈ పోటీల్లో 2,300 మంది విద్యార్థులు పాల్గొనగా విజేతలకు డీఈఓ ఆర్.వెంకటరమణ బహుమతులు అందచేసినట్లు చెప్పారు.

ధ్యానంతో శారీరక ఆరోగ్యం

వీరవాసరం: మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో కొణితివాడలో యరకరాజు అరుణ ఇంటివద్ద ఆదివారం ఉచిత ధ్యానశిక్షణ నిర్వహించారు. కృష్ణా జిల్లా బొడ్డపాడుకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఎం.శివశంకరరావు పాల్గొని జ్ఞాన బోధ చేశారు. ధ్యానం అంటే ఆలోచనా రహిత స్థితిలో ఉండటమన్నారు. ధ్యానం చేయడం వల్ల విశ్వశక్తిని పొంది నాడి మండల శుద్ధి జరిగి శారీరక ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ప్రతిఒక్కరూ శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యానం చేయాలన్నారు. ఆధ్యాత్మిక గీతాలను రాగయుక్తంగా పాడి సామూహిక ధ్యానం చేయించారు. నాగరాజు సుబ్బరాజు తన ధ్యాన అనుభవాలను అందరితో పంచుకున్నారు. సొసైటీ జిల్లా కో–ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్, కె.మోహన్, రామకృష్ణంరాజు, యరకరాజు అరుణ, భవాని ఉమావర్షిత పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

సాక్షి, భీమవరం: మతి స్థిమితంలేని స్థితిలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వృద్ధురాలు చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. భీమవరం వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గునుపూడికి చెందిన జవ్వాది గంగాభవాని (62)కి మతి స్థిమితం లేదు. ఈనెల 2న ఇంటి వద్ద పురుగుమందు తాగడంతో చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. మెరుగైన చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. ఏఎస్‌ఐ ఎం.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేల్పూరు ముంగిటకు త్వరలో మెరుగైన వైద్యం

- రూ.6 కోట్ల వ్యయంతో సీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రతిపాదనలు
- 10 గ్రామాల ప్రజలకు చేరువ కానున్న మెరుగైన వైద్య సేవలు
- మంత్రి కారుమూరి చొరవపై ప్రజల్లో హర్షం



వేల్పూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

తణుకు టౌన్: వేల్పూరులో రూ.6 కోట్ల వ్యయంతో కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదేశాలతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. ఈ గ్రామంలో సుమారు 30 వేల జనాభా ఉండగా, సుమారు 10 గ్రామాలకు కూడలి గ్రామంగా వేల్పూరు ఉంది. ఈ గ్రామంలో పంచాయతీ భవనం సమీపంలో పూర్వం వైద్యశాల ఉండేది. 1999లో ఇక్కడ పీహెచ్‌సీని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి కొమరవరం, మహాలక్ష్మీ చెరువు, యర్రాయి చెరువు గ్రామాలతో పాటు తేతలి, దువ్వ, ముద్దాపురం, కోనాల గ్రామాల ప్రజలు వైద్యం కోసం ఇక్కడకు వచ్చేవారు. ప్రస్తుతం ఇక్కడ ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక ఫార్మాసిస్ట్, ఒక ల్యాబ్ టెక్నిషియన్, సీహెచ్‌ఓ, ఎంపీహెచ్‌ఎస్ మేల్ అండ్ ఫీమేల్, పీహెచ్‌ఎన్, సీహెచ్‌వో పని చేస్తున్నారు. ముఖ్యంగా ఈ గ్రామాల్లో గర్భిణులు అత్యవసర వైద్యం కోసం తణుకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో ఇక్కడ స్పెషలిస్ట్ వైద్యుల పర్యవేక్షణలో ఉండే కమ్యూనిటీ ఆసుపత్రి అవసరం ఏర్పడింది. దీంతో మంత్రి కారుమూరి వేల్పూరులో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించి రూ.6 కోట్ల అంచనాలతో కూడిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేశారు. గ్రామంలో ఈ ఆసుపత్రి నిర్మాణం జరిగితే నలుగురు స్పెషలిస్ట్ వైద్యులు, ముగ్గురు ఎంబీబీఎస్ వైద్యులతో పాటు ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక హెడ్ నర్సులు 24 గంటలూ అందుబాటులో ఉండటంతో మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. వేల్పూరులో సీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే ఇక్కడ వున్న పీహెచ్‌సీని దువ్వకు తరలించనున్నారు. ఎన్నో ఏళ్లుగా దువ్వ ప్రజలు ఎదురుచూస్తున్న వైద్య సేవలు సుమారు 10 గ్రామాల ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

రాత్రి వేళల్లో గర్భిణులకు సకాలంలో వైద్యం



వేల్పూరులో 30 పడకల సీహెచ్‌సీ ఏర్పాటు వలన గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా గర్భిణులకు రాత్రి వేళల్లో సకాలంలో వైద్యం అందుతుంది.

– నున్న దుర్గాప్రసాద్, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు, వేల్పూరు

తీరనున్న 30 ఏళ్ల కల



దువ్వ గ్రామం సుమారు పది గ్రామాలకు కూడలిగా ఉంది. ఇక్కడ పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ 30 ఏళ్ల నుంచి ఉంది. మంత్రి కారుమూరి చొరవతో వేల్పూరు, దువ్వ గ్రామాలకు వైద్య సేవలు ముంగిటకే చేరనున్నాయి.

– రుద్ర ధనరాజు, ఎంపీపీ, తణుకు